# సాక్షి సంగారెడ్డి

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



## వయోజన విద్యకు ఉల్లాస్

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వివరాలు 8లో ▸



## 'మహిళా శక్తి' బలోపేతం

మహిళా శక్తిని బలోపేతం చేసేందుకు అధికారులు నూతనంగా మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. వివరాలు 8లో ▸



## భయం భయంగా బడికి..

ప్రభుత్వం బడుల బలోపేతానికి ప్రాధాన్యమిస్తున్నామని చెబుతున్నా.. సౌకర్యాలు మాత్రం కరువయ్యాయి. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### రాజీవ్‌పార్కులో ఇండోర్ స్టేడియం: జగ్గారెడ్డి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా కేంద్రంలో ఉన్న రాజీవ్‌పార్కులో పీపీటీ పద్ధతిలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఈ పార్కులో మ్యూజికల్ ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్, మినీపాండ్- పైడల్ బోట్లు వంటి అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ)కు చెందిన రూ.3 కోట్లతో ఈ పార్కు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లతో చర్చినట్లు తెలిపారు.

### సర్వేయర్లకు సముచిత స్థానం

సర్వే ల్యాండ్స్ రికార్డు జిల్లా అధికారి ఐనెష్



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారి ఐనెష్

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలో భాగంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో సర్వేయర్లకు సముచిత స్థానం కల్పించిందని సర్వే ల్యాండ్స్ రికార్డు జిల్లా అధికారి ఐనెష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మొదటి విడత శిక్షణలో ఉత్తీర్ణులైన లైసెన్స్ సర్వేయర్లకు కలెక్టరేట్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియం చేసుకోవాలన్నారు. అలాగే పొరపాట్లు లేకుండా భూములకు సంబంధించిన కొలతలు, మ్యాప్స్‌పై రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు రాజు, భిక్షపతి, శ్రీనివాస్, రహుల్ల పాల్గొన్నారు.

### భూసమస్యలు పరిష్కరించాలని వినతి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్, బుర్దిపాడ్‌లలో నెలకొన్న భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ దశరథ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతితో కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అధికారాలు ఆర్డీఓ, తహసీల్దార్‌లకు అప్పగిస్తే అన్ని రకాల భూసమస్యల పరిష్కారమవుతాయన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు కుమార్, నర్సింలు, తుల్జారాం, రాములు, ఏసయ్య పాల్గొన్నారు.

### ఐఐటీహెచ్‌లో ఫిన్‌షీల్డ్ హ్యాకథాన్



హ్యాకథాన్ విజేతలతో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ ఐఐటీలో బుధవారం ఫిన్‌షీల్డ్ హ్యాకథాన్ నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ హ్యాకథాన్ జరిగింది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 72 జట్లతో పాటు, 661 మంది ఇందులో పాల్గొంటున్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### చదువుతోపాటు కంప్యూటర్ విద్య ముఖ్యం: వెంకటేశ్వర్లు



ల్యాబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ

కంది(సంగారెడ్డి): విద్యార్థులకు చదువుతో పాటు కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఇంద్రకరణ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'లామ్'కంపెనీ సౌజన్యంతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్ అండ్ సైన్స్, గ్రంథాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం లామ్ టప్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ కుమార్ మెహతా, కమలేష్ మెహెతాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈఓ జోగప్ప, ప్రధానోపాధ్యాయుడు ఠాగూర్ ఉదయ్ సింగ్, ఆఫీసర్ తుల్జా నాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, డీసీఐబీ ఇన్‌చార్జ్ లింబాజి, ఎంపీఓ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏడాదిలోనే ఐదుగురు

- భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ల స్థాన చలనం
- సగటున రెండున్నర నెలల్లోనే ఒకరు మార్పు
- కీలక శాఖలో వింత పోకడలు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: భూగర్భజలశాఖ డిప్యూటీ డైరెక్టర్ పోస్టులోని అధికారులు తరచూ మారుతున్నారు. కేవలం ఏడాది కాలంలోనే ఏకంగా ఐదుగురు అధికారులు జిల్లాకు వచ్చి వెళ్లారు. ఒక్కో అధికారి సగటున రెండున్నర నెలలు కూడా ఈ పోస్టులో పనిచేయకపోవడం గమనార్హం. సంవత్సర కాలంలో మారిన అధికారుల తీరును పరిశీలిస్తే.. ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా చాలా ఏళ్లుగా పనిచేసిన వెంకటేశ్వర్‌రావుకు 2024 ఆగస్టులో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి వచ్చింది. దీంతో ఆయన బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో మరో అధికారి డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కొన్ని రోజులకే ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఖాళీ అయిన ఈ స్థానాన్ని గంగ నర్సింహులు ఈ పోస్టులో జాయిన్ అయ్యారు. రెండు, మూడు నెలలకే ఆయన రిటైర్డు అయ్యారు. దీంతో మరోసారి ఈ పోస్టు ఖాళీ అయింది. దీంతో ఇన్‌చార్జిగా హరీష్‌బాబు అనే మరో అధికారికి పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా ఆయన్ను కూడా మార్చుతూ ఆశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో తాజాగా జీ.మోహన్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇలా ఏడాది కాలంలో ఏకంగా ఐదుగురు ఉన్నతాధికారులు మారడం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



భూగర్భ నీటిమట్టాలు.. పలు సంక్షేమ పథకాలు

రైతులు తమ వ్యవసాయభూముల్లో ఎక్కడ బోరు వేస్తే నీళ్లు వస్తాయని ఈ భూగర్భజల శాఖ అధికారులు చెబుతుంటారు. ఇందుకోసం వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే భూగర్భ జలమట్టాల వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా వివిధ చోట్ల ఉన్న ఫీజోమీటర్లలో జలమట్టాన్ని కొలుస్తూ నివేదికలు తయారు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతుంటారు. టీజీబీపాస్ విధానంలో వివిధ పరిశ్రమలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల మంజూరులో ఈశాఖది కీలక పాత్ర ఉంటుంది. వాల్టా చట్టాన్ని అమలు చేయడంలో రెవెన్యూశాఖకు నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. ట్రైబల్ సబ్ ప్లాన్ కింద రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఈ శాఖ ద్వారానే కొనసాగుతున్నాయి. అలాగే ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కార్యకలాపాలు కూడా ఈ శాఖ నిర్వర్తిస్తుంది. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల శాంపిల్‌లను సేకరించి అందులో ఏవైనా హానికరమైన రసాయనాలు ఉన్నాయా? అనేది చూస్తుంటారు. ఇలాంటి కీలక కార్యకలపాలు నిర్వహించే ఈశాఖకు తరచూ అధికారులు మారుతుండటంతో ఆయా పథకాల అమలు తీరుపై ప్రభావం పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### పలుశాఖల్లో పాతుకు పోతుంటారు

సాధారణంగా పలు శాఖల ఉన్నతాధికారులు ఏళ్ల తరబడి పాతుకు పోతుంటారు. ఎన్నికలు వస్తే గానీ వీరు కదలరు. ఎన్నికల కమిషన్ ఆదేశాలిస్తే తప్ప వారు తమ పోస్టులను వదలరు. తమకు ఆర్థికంగా కలిసొచ్చే పోస్టుల్లో కొనసాగేందుకు చేయని పైరవీలు ఉండవు. రాజకీయ అండదండలతో చాలా ఏళ్లుగా ఒకే చోట పాతుకు పోయిన అధికారులు ఉంటారు. ఏకంగా ప్రభుత్వాలు మారినా వీరు మాత్రం మారని అధికారులు కూడా జిల్లాలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలకు వంత పాడుతూ పాతుకుపోయిన వారు కూడా ఉన్నారు. కానీ కారణమేదైనా ఏడాదిలోనే ఏకంగా ఐదుగురు అధికారులు మారడం ఇప్పుడు అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



పెసర, మినుము చేనులో నిలిచిన వర్షపునీరు

# వామ్మో.. మళ్లీ వానలా?

- సెప్టెంబరులోనూ భారీ వర్షాలు హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- ఆగస్టులో 171శాతం అధిక వర్షపాతం
- కోత దశలో దెబ్బతిన్న పెసర, మినుము పంటలు

నారాయణఖేడ్: వానాకాలం పంటలపై రైతుల్లో గుబులు నెలకొంది. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రకృతి సహకరించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టు మాసం భారీ వర్షాలతో రైతులను అతలాకుతలం చేసింది. సెప్టెంబరు మాసం కూడా భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో మరింత గుబులు నెలకొంది. రానున్న ఐదు రోజులు కూడా వర్షాలు ఉంటాయని ప్రకటించడం రైతుల్లో మరింత ఆందోళన రేకెత్తిస్తుంది. వరద నీరు చేలల్లోకి రావడం, సాగుభూముల్లో వర్షపు నీరు నిలవడంతో పంలు పంటల దిగుబడులపై ఆందోళన నెలకొంది. రానున్న కాలంలోనూ వర్షాలు ఉంటాయన్న హెచ్చరికలో మరింత ఆందోళన వ్యక్తం అవుతుంది.

**ఆగస్టులో 171 శాతం అధిక వర్షం**

ఆగస్టులో కురియాల్సిన వర్షం కంటే అధికంగా వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం 193.2మి.మీ కురియాల్సి ఉండగా.. జిల్లాలో 525.1 శాతం వర్షపాతం నమోదు అయింది. అంటే 171శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు లెక్కగట్టారు. సెప్టెంబర్ కూడా సాధారణం కంటే అధికంగానే వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్ నియోజకవర్గాల్లో పెసర, మినుము పంటలు ప్రస్తుతం కోత దశలో ఉండటం నష్టాన్ని కలిగిస్తుంది. ఇప్పటికే పత్తి, సోయా, కంది, మినుము, పెసర తదితర పంట చేలల్లో నీరు నిలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నల్ల రేగడి నేలల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల వేరుకుళ్లు తెగులు సోకే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నిమ్జ్ భూ సేకరణకు బ్రేక్!

- నిలిచిన చెక్కుల పంపిణీ
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- ఖాళీగా డిప్యూటీ కలెక్టర్ పోస్టు

జహీరాబాద్ టౌన్: జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి (నిమ్జ్) భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. రెండు నెలల నుంచి నిమ్జ్ కార్యాలయంలో ఎలాంటి కార్యకలాపాలు జరగడంలేదు. పరిహారం చెక్కుల కోసం రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రైతులతో నిత్యం కళకళలాడాల్సిన కార్యాలయం బోసిపోయింది. భూసేరణ పనులు జోరందుకున్న వేళ.. జులై 10న నిమ్జ్ కార్యాయలంలో ఏసీబీ దాడులు జరిగాయి. భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్యలు ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఆ రోజు నుంచి భూసేకరణకు సంబంధించిన పనులు నిలిచిపోయాయి. పరిహారం చెక్కుల పంపిణీకి సిద్ధంగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో బ్రేక్ పడింది.

**సెలవులపై వెళ్లిన ఆర్డీఓ**

కలెక్టర్ ప్రావీణ్య జహీరాబాద్ ఆర్డీఓ రాంరెడ్డికి నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయన ఆరోగ్యం బాగాలేదని సెలవుపై వెళ్లారు. రెండు నెలల నుంచి నిమ్జ్ పనులను చూసే వారు లేరు. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

### ఏమీ చేయలేని పరిస్థితి నాది



నా పేరు విఠల్. మాది రేజింతల్ గ్రామం. 32 గుంటల భూమి నిమ్జ్ ప్రాజెక్టులో పోయింది. ఇంట్లో శుభకార్యం ఉంది. డబ్బుల అవసరం చాలా ఉంది. ప్రతి రోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూఐ పట్టించుకోవడం లేదు. నిమ్జ్‌లో భూమి పోవడంతో బ్యాంక్‌లో లోన్ కూడా ఇవ్వడంలేదు. భూమి అమ్ముదామంటే నిమ్జ్‌లో పోయిందని ఎవరూ కొనడం లేదు. ఏమీ చేయలేని పరిస్థితి నాది. డిప్యూటీ కలెక్టర్‌ను నియమించి వెంటనే పరిహారం చెక్కులు పంపిణీ చేయాలి.

– బి.విఠల్, రైతు, రేజింతల్

# సహకారం.. పొడిగింపు





## పీఏసీఎస్‌ల పనితీరు ఆధారంగా నిర్ణయం

- ఉమ్మడి జిల్లాలోని 89 సొసైటీల్లో పాలకవర్గాల పదవీకాలం కొనసాగింపు
- 21 సొసైటీల్లో పెండింగ్
- వారినే కొనసాగిస్తారా? లేదా అన్నది సందిగ్ధం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల పనితీరు ఆధారంగా పదవీకాలాన్ని పొడిగించారు. ఆగస్టు 14వ తేదీతో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 111 పీఏసీఎస్‌లు ఉండగా.. పాలకవర్గాల పనితీరు మేరకు 89 వాటికే పదవీకాలం పొడిగిస్తూ బుధవారం ఆయా జిల్లాల డీసీఓలు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే మెదక్ జిల్లాలోని రాంపూర్ పీఏసీఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జి కొనసాగుతుండగా మరో 21 సంఘాల పదవీకాలం పొడిగింపు సహకార శాఖ పెండింగ్‌లో పెట్టింది.

సాక్షి, సిద్దిపేట: మండల స్థాయిలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు అందజేస్తూ పీఏసీఎస్‌లు అండగా నిలుస్తున్నాయి. ఇలాంటి వాటికి ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుంది. సంఘం పరిధిలోని రైతులు, డైరెక్టర్లు, చైర్మన్లతో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. 2020లో ఎన్నికైన పాలకవర్గం గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగియగా మరో ఆరు నెలలు(ఆగస్టు 14వ తేదీ) వరకు ఇదివరకే పొడిగించారు. గత నెలలో మరో ఆరు నెలలు పదవీకాలం పొడిగించేందుకు సహకార శాఖ పలు నిబంధనలు పెట్టింది.

**పనితీరుపై ఆరా..**

తాజా నిబంధనల ప్రకారం పనితీరు మెరుగ్గా ఉంటేనే వాటి పాలకవర్గాల గడువు పొడిగింపు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంఘాల వారీగా పది అంశాలతో కూడిన సమాచారం అందించాల్సిందిగా జిల్లా సహకార శాఖను ఆదేశించింది. సొసైటీ పరిధిలో పాత బకాయిల పరిస్థితి రుణాల తిరిగి చెల్లింపులు సక్రమంగా ఉన్నాయా? నిధుల దుర్వినియోగం ఏమైనా జరిగిందా? జరిగితే వాటిపై ఎలాంటి విచారణ చేపట్టారు? దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నారా? సొసైటీ కార్యకలాపాలపై ఆడిట్ చేశారా? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

| జిల్లా | మొత్తం సంఘాలు | పదవీకాలం పొడిగింపు | పెండింగ్ |
|---|---|---|---|
| మెదక్ | 37 | 28 | 8 |
| సిద్దిపేట | 21 | 18 | 3 |
| సంగారెడ్డి | 53 | 43 | 10 |

(రాంపూర్‌కు పర్సన్ ఇన్‌చార్జి)

### ఉత్తర్వులు జారీ చేశాం



జిల్లాలో 18 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశాం. మరో మూడు సంఘాలు హుస్నాబాద్, అల్లిపూర్, దుబ్బాక పదవీకాలం పొడిగింపు పెండింగ్‌లో ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే వాటి ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- నాగేశ్వర్‌రావు, డీసీఓ, సిద్దిపేట

### 21 సంఘాలకు బ్రేక్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 సంఘాలపై పలు ఆరోపణలు రావడంతో పాలకవర్గాల పదవీ కాలం పొడిగింపునకు బ్రేక్‌లు పడ్డాయి.
- సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, అల్లిపూర్, దుబ్బాక, మెదక్ జిల్లాలో రామాయంపేట్, చిన్న ఘన్‌పూర్, మదూర్, చేగుంట, ఇబ్రహీంపూర్, రేగోడ్, టెక్మాల్, కల్వకుంట పీఏసీఎస్‌లు ఉన్నాయి.
- సంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో పీఏసీఎస్‌లు చెప్పేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.
- ఆయా పాలకవర్గాల పదవీకాలం పొడిగిస్తారా? లేక పదవులు ఊడుతాయా అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ సంఘాలకు త్వరలో పర్సన్ ఇన్‌చార్జులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.
- ఆయా సంఘాలలో అక్రమాలకు పాలకవర్గం కారణమా? ఆ సంఘ సిబ్బంది కారణమా? అనే వివరాలు సైతం సేకరిస్తున్నట్లు సమాచారం. సిబ్బంది అక్రమాలకు పాల్పడితే తిరిగి పాలకవర్గం పదవీకాలం కొనసాగింపుపై ప్రశ్నార్థకం నెలకొంది.

# బాలల రక్షణలో చట్టాలు కీలకం

జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి లలితా కుమారి

జహీరాబాద్: మహిళలు, బాలల రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమని, బాలికల విద్య భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలితకుమారి అన్నారు. బుధవారం జహీరాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో పీసీపీఎన్డీటీ, పోక్సో, గృహహింస, పోష్, బాల్య వివాహ నిషేధ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడారు. మహిళలు, బాలల రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమైనవిగా పేర్కొన్నారు. బాలికల విద్య, వారి భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ నిషేధమని, దానిని అరికట్టడంలో అందరూ కట్టుబడి ఉండాలన్నారు.



మాట్లాడుతున్న లలితకుమారి

పోక్సో చట్టం బాలలపై లైంగిక దాడులను అరికట్టడంలో కఠిన చర్యలు తీసుకుంటుందని, గృహ హింస, పోష్ చట్టాలు మహిళలకు రక్షణ కల్పిస్తున్నాయని వివరించారు. బాల్య వివాహాల నివారణ సమాజంలోని అందరి బాధ్యతగా పేర్కొన్నారు. అనంతరం ఆమె చిరాగ్‌పల్లిలోని అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి టీచర్లతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో సీడీపీఓ అంజమ్మ, మెడికల్ ఆఫీసర్ సొహేయిల్, జిల్లా సమన్వయ కర్త పల్లవి పాల్గొన్నారు.

# పత్తి రైతు కుదేలు

భారీ వర్షాలకు పత్తి రైతులు నష్టపోతున్నారు. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో దెబ్బతిన్నది. ప్రారంభంలో పంటలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంబురపడ్డారు. కానీ పంట ఏపుగా ఉన్న సమయంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురడంతో పత్తి రైతు కుదేలవుతున్నాడు.

జహీరాబాద్ టౌన్:

### నిండా ముంచిన భారీ వర్షాలు

- ఎర్రబారుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

జిల్లాలో కొన్నేళ్ల నుంచి రైతులు అధిక విస్తీర్ణంలో పత్తిని సాగు చేస్తున్నారు. గతేడాది కన్న ఈ సారి పంట విస్తీర్ణం పెరిగింది. సుమారు 3.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్లు అధికారులు తెలిపారు. వర్షం ఎక్కువైనా కొంత మేర పంట తట్టుకుంటుందనే ఉద్దేశంతో అన్నదాతలు పత్తి సాగుకు మొగ్గు చూపారు. వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో ప్రారంభంలో పత్తి చేనుకు ఆశాజనకంగా ఉంది. పంట ఏపుగా పెరగడంతో దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల పదిహేను రోజులు భారీ వర్షాలు కురవడంతో పంట బాగా దెబ్బతింది. జహీరాబాద్, మునిపల్లి, న్యాల్‌కల్, రాయికోడ్, ఝరాసంగం, వట్‌పల్లి తదితర మండలాల్లో పత్తిపంటకు ఎక్కువగా నష్టం వాటిల్లింది.



చేనులో నిలిచిన నీరు



వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

### రంగు మారుతున్న పంట

భారీ వర్షాల వల్ల పంట రంగు మారుతుంది. తెగుళ్ల బెడదతోపాటు, పొలాల్లో నీరు చేరి పంట దెబ్బతింటుంది. ఇప్పటికే వేల రుపాయలు ఖర్చు చేసిన రైతులు ఉన్న పంటను కాపాడుకునేందుకు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మొక్కలో బలం లేక దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులు చేతి నుంచి డబ్బులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### పెట్టుబడులు ఎక్కువ



ఏడెకరాల్లో పత్తి సాగు చేశా. పంట కోసం భారీగా పెట్టుబడులు పెట్టా. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఖర్చు చేశా. ఇంకా రసాయన మందులను పిచికారీ చేయాలి. కలుపు తీయడం తదితర వంటి పనులు చేపట్టాల్సి ఉంది. ఎకరాకు ఇంకా రూ. 10 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. పెట్టుబడులు పెట్టినా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరానికి కనీసం 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే సగం కూడా వచ్చే అవకాశాలు లేవు.

– రాయిపల్లి సాయికుమార్, రైతు, కంబాలపల్లి

## క్లుప్తంగా

### జీపీఓ నియామకానికి 239 అభ్యర్థులు

కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి జోన్: గ్రామ పాలన అధికారి నియామకానికి జిల్లా నుంచి 239 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. బుధవారం రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుంచి కలెక్టర్ తో పాటు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక కోటాలో 209, స్థానికేతర కోటాలో 10 పోస్టులు కేటాయించగా, అదనంగా 20 పోస్టులను మెదక్ జిల్లాకు అలాట్మెంట్ చేసినట్లు వివరించారు. ఈ నెల 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందించే నియామక పత్రాల కొరకు అభ్యర్థులను పంపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్ఓ పద్మజారాణి, తదితరులు పాల్గొన్నారు.

### 300 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం... బుధవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి గుజరాత్‌కు 300 క్వింటాల రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### చిరుత దాడిలో గేదె మృతి

కల్హేర్(నారాయణఖేడ్): చిరుత పులి దాడి చేయడంతో గేదె మరణించింది. ఈ ఘటన సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు... గ్రామానికి చెందిన రైతు నాయకుని తుకారాం తన వ్యవసాయ క్షేత్రంలో పశువులను కట్టేశాడు. చిరుత పులి దాడి చేయడంతో గేదె తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పశువైద్యుడు జెస్సిక్రాంతి, అటవీ శాఖ అధికారులు సందర్శించారు. కాగా ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. కొంత కాలంగా చిరుత పులి సంచరిస్తుండడంతో కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

### నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

డీఎస్పీ సత్తయ్య



సంగారెడ్డి క్రైమ్: వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ సత్తయ్య అన్నారు. బుధవారం ఆయన స్థానిక మహబూబ్‌సాగర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలో తొమ్మిదవ రోజు నిమజ్జనానికి మరింత మంది భక్తులు వచ్చే అవకాశాలను అంచనా వేస్తున్నామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పట్టణ పరిధిలో మొత్తం నిమజ్జన ఏర్పాట్లు పట్టణ పోలీస్ అధికారులతో పాటు 200 ప్రత్యేక బలగాల సేవలను వినియోగిస్తున్నట్లు చెప్పారు.

### బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా... పిట్లంకు చెందిన శివకాంత్ (33) బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం వచ్చి డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్నేహితుడు రాజుతో కలిసి గణేశ్ గడ్డ పాదయాత్రకు వెళ్తుండగా రుద్రారం సమీపంలోకి చేరుకోగానే పటాన్‌చెరు నుండి సంగారెడ్డి వైపు వెళ్తున్న బొలెరో వాహనం శివకాంత్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.



# వయోజన విద్యకు ఉల్లాస్

## చదవడం, రాయడం నేర్పించడమే లక్ష్యం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రారంభం
- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిరక్షరాస్యుల గుర్తింపు
- ఉమ్మడి జిల్లాలో 1,30,274 మంది గుర్తింపు



మెదక్ డీఈఓ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): డ్వాక్రా మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ప్రతీ మహిళ అక్షర జ్ఞానం కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాయి. విద్యాశాఖ, సెర్ప్ ఉమ్మడి భాగస్వామ్యంతో కొనసాగనుంది. ఉల్లాస్ కింద తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం నుంచి రేపో, మాపో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది.

సామాజిక సాధికారతలో భాగంగా చదువురాని వారందరికీ చదవడం, రాయడం నేర్పించడమే ఉల్లాస్ పథకం ప్రధాన లక్ష్యం. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల్లో 50 శాతం మంది మాత్రమే సంతకం చేస్తున్నారని, మిగిలిన వారు వేలిముద్ర వేస్తున్నారన్న సమాచారం ప్రభుత్వం దగ్గర ఉంది. దీంతో వయోజన మహిళలకు చదువు నేర్పించడమే కాకుండా మధ్యలో బడి మానేసిన వారిని సైతం గుర్తించి నేరుగా ఓపెన్ పది, ఆసక్తి ఉంటే ఓపెన్ ఇంటర్,డిగ్రీ వరకు చదివిస్తారు. ఆ తర్వాత వారికి స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ కోర్సులు నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక క్రమశిక్షణ, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను నేర్పిస్తారు.

### చదువు చెప్పే బాధ్యత వలంటీర్లకు

15 నుంచి 20 మంది చొప్పున గ్రూపులను ఏర్పాటు చేస్తారు. మహిళా సంఘాల్లో అక్షరాస్యులైన వారిని వలంటీర్లుగా ఎంపిక చేసి నిరక్షరాస్యుల గ్రూపులను కేటాయించి వారికి చదువు చెప్పిస్తారు. గ్రూపులో ఉన్న సభ్యులకు చదవడం, రాయడం వచ్చే వరకు చదువు చెప్పే బాధ్యత వలంటీర్లకు అప్పగించారు. విద్యాశాఖ పుస్తకాలతోపాటు ఉపాధ్యాయుల ద్వారా సహకారం అందించనున్నారు. తల్లి చదవడం ద్వారా ఆ కుటుంబంలో వెలుగు నిండుతుంది. తద్వారా బడికి వెళ్లే పిల్లల సంఖ్య పెరగడంతోపాటు డ్రాపౌట్ తగ్గి బాల్య వివాహాలపై అవగాహన పెరుగుతుంది. గ్రామంలో అక్షరాస్యులు ఉంటే అన్నిరంగాల్లో అభివృద్ధిలో పయనించేందుకు దోహదపడుతుంది.

### నిరక్షరాస్యుల గుర్తింపు

డీఆర్‌డీవో, సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యుల సంఖ్యను వీవోఏల ద్వారా గుర్తించారు. నిరక్షరాస్యులు, మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి నివేదిక అందజేశారు. సంగారెడ్డి జిల్లాలో 55,371, మెదక్ జిల్లాలో 33,750 , సిద్దిపేట జిల్లాలో 41,153 మంది మహిళలను గుర్తించారు. ఇప్పటికే పథకానికి సంబంధించిన విధి విధానాలను సెర్ప్ అధికారులు, సిబ్బందికి సమగ్రంగా వివరించారు. దాదాపు జిల్లా, మండల స్థాయిలో శిక్షణనిచ్చారు.

### మహిళలకు మంచి అవకాశం



నిరక్షరాస్యులకు ఉల్లాస్ పథకం మంచి అవకాశం. మహిళా సంఘాల్లో నిరక్షరాస్యుల వివరాలు సేకరించాం. నిరక్షరాస్యులతో పాటు బడి మధ్యలో మానేసిన వారికి, దివ్యాంగులకు సైతం చదవడం, రాయడం నేరిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని నిరక్షరాస్యులైన మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– కె.వెంకట్‌రెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి మెదక్ జిల్లా

# ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- వివాహిత ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

హవేళిఘణాపూర్(మెదక్): వివాహేతర సంబంధం వద్దని మందలించడంతో ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందిన ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని నాగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన ఓ మహిళ(28) అదే ఊరికి చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ క్రమంలో భర్తకు అనుమానం వచ్చి పలుమార్లు హెచ్చరించినా ఆమెలో మార్పు రాలేదు. దీంతో భర్త ఈ నెల 1న సాయంత్రం భార్య కుటుంబీకులను పిలిపించి పెద్దల సమక్షంలో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు తలుపులు తీసి చూడగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే మెదక్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలానికి చెందిన మహేశ్(37) తన భార్య, కుమార్తెతో కలిసి విద్యుత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా కొద్ది రోజులుగా మహేశ్ ఏ పని చేయకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం భార్య పాపను తీసుకుని కాలనీలోని వినాయక మండపం వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే సరికి మహేశ్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు.

### తల్లిదండ్రుల గొడవతో కూతురు..

కౌడిపల్లి(నర్సాపూర్): తల్లిదండ్రుల గొడవతో మనస్తాపానికి గురైన కూతురు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన బండల మైసయ్య, శమంతల పెద్దకూతురు అక్షిత(21) ఇటీవల బీటెక్ పూర్తి చేసింది. ఇటీవల ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంది. కాగా తల్లిదండ్రులు ఇద్దరు తరచూ గొడవ పడుతుండేవారు. మంగళవారం రాత్రి ఇంటి ముందు తల్లిదండ్రులు ఇద్దరూ సంసారం విషయంలో గొడవపడ్డారు. గొడవ పడొద్దని చెప్పినా వినకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన అక్షిత ఏడ్చుకుంటూ ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుంది. కొద్దిసేపటికి తల్లిదండ్రులు వెళ్లి చూడగా ఉరివేసుకుని ఉంది. కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందింది.



అక్షిత

### మద్యానికి బానిసై..



మల్లేశం

దుబ్బాక: మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కీర్తి రాజు కథనం మేరకు... ధర్మాజీపేట వార్డుకు చెందిన భూరు మల్లేశం(61) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే తీవ్ర అనారోగ్యానికి గురై కొన్ని రోజులుగా బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

### గొడవల నేపథ్యంలో వివాహిత..



శివపార్వతి

పటాన్‌చెరు టౌన్: భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన వెంకట కోటేశ్వర రావు ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య శివపార్వతితో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి బెడ్ రూమ్ లోకి వెళ్లిన భార్య ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది.

### కవితవి అసత్య ఆరోపణలు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి: మాజీ మంత్రి హరీశ్రావుపై ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలు అసత్యాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలన్నారు. కేసీఆర్ మాట జవదాటి ఒక్క అడుగు కూడా హరీశ్ రావు వేరే వైపు వెళ్లనే లేదు. కేసీఆర్ ఏ పని చెప్పినా ఎందుకు? అని అడగకుండా ప్రతి పని చేశారు. ఉద్యమ సమయంలో ఎన్నిసార్లు రాజీనామా చేయాలని కేసీఆర్ ఆదేశించినా.. అన్నిసార్లూ రాజీనామా చేసి ఉద్యమ వేడిని రగిలించిన నేత హరీశ్‌రావు అని స్పష్టం చేశారు. హరీశ్‌రావుపై కవిత చేసిన ఆరోపణలను మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఒక ప్రకటనలో ఖండించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు... పట్టణ శివారులో ఎక్కలదేవు బండవద్ద జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనగా, వ్యక్తి తీవ్ర గాయాలకు గురైనట్లు అజయ్ అనే వ్యక్తి 100కు ఫోన్ చేసి సమాచారం అందజేశాడు. పోలీస్ పెట్రోలింగ్ వాహనం వెళ్లి చూడగా, అప్పటికే సదరు వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఉద్యోగం పేరుతో సైబర్ చీటింగ్

రూ.6 లక్షల 64 వేలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగం పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రైవేటు ఉద్యోగిని నమ్మించి డబ్బులు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్రెగూడెంకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఆగస్టు 14న పార్ట్ టైం జాబ్ పేరుతో తన ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అందులో తన వివరాలు నమోదు చేశాడు. ఈ క్రమంలో అపరిచిత వ్యక్తులు నగదు ఇన్వెస్ట్ చేసి ఇచ్చిన టాస్కలు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని ఆశ చూపారు. వారు చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.6 లక్షల 64 వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతో పాటు, కమీషన్ ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### చికిత్స పొందుతూ యువకుడు...

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నగరంలోని చార్మినార్ రహమత్ నగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి మహమ్మద్ రిజ్వాన్ (20) వాహనంలో స్నేహితులతో కలిసి సంగారెడ్డి పరిధిలో ఉన్న జంజం దాబాలో భోజనం చేసేందుకు గత నెల 19న అర్ధరాత్రి కారులో బయలు దేరారు. ముత్తంగి చర్చి సమీపంలోకి రాగానే కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపిన మహమ్మద్ గౌస్ డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు అవతల వైపు రహదారిపై బోల్తా పడింది. దీంతో మహమ్మద్ రిజ్వాన్‌కు తీవ్ర గాయాలవ్వగా అతనితోపాటు వాహనంలో ఉన్న మహమ్మద్ హనీఫ్, మహమ్మద్ గౌస్, మహమ్మద్ ఆరిఫ్ అలీ, షేక్ ఇస్మాయిల్‌కు గాయాలయ్యాయి. వీరు పటాన్‌చెరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మహమ్మద్ రిజ్వాన్ మాత్రం ఉస్మానియాలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

### ద్విచక్రవాహనం దహనం

జిన్నారం (పటాన్‌చెరు): ద్విచక్రవాహనం తగలబడిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చేటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డి వివరాల ప్రకారం... మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కిరణ్ మంగళవారం తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి బయటకు వెళ్లాడు. తిరిగివచ్చి రాత్రి ఇంట్లో పడుకున్నాడు. సుమారు 11 గంటల సమయంలో బయటకు వచ్చి చూసే సరికి ద్విచక్రవాహనం తగలబడుతుండటంతో మంటలు ఆర్పేశాడు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

- విద్యార్థినులు హృతిక, హొన్నేశాలకు ప్రిన్సిపాల్ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): సీబీఎస్ఈ తైక్వాండో సౌత్ జోన్-1 టోర్నమెంట్ ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం కమల హైస్కూల్ ఆధ్వర్యంలో ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో భారతీయ విద్యాభావన్ పబ్లిక్ స్కూల్, బీహెచ్ఈఎల్ విద్యార్థినులు ఎం.హృతిక, ఎం.హొన్నేశా రజత పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు సెప్టెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెబోలు ఉమాశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి విజేతలను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ వెంటే


ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు



జహీరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక చరిత్ర అని, ఉద్యమం నాటి నుంచి నేటి వరకు ఆయన కేసీఆర్ వెంటే ఉన్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హరీశ్‌రావుపై కవిత చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేసి త్యాగం చేసిన చరిత్ర హరీశ్‌రావుదని పేర్కొన్నారు. బేగం బజార్‌కు వెళ్లి జెండా కలర్స్ కూడా ఆయన తెచ్చారని గుర్తు చేశారు. మొదటి జెండా దిమ్మె కట్టించింది కూడా అతడే అన్నారు. పార్టీకి క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. న్యూస్ పేపర్లు వేసుకుని నేలపై చాలా చోట్ల పడుకున్న వ్యక్తిత్వం అని వివరించారు. లక్ష్యం నెరవేర్చడానికి ఒక్క రోజు కూడా విరామం తీసుకోలేదన్నారు. ప్రజలకు చేరువలో ఉండి పని చేసే విషయాన్ని తాను ఆయన నుంచే నేర్చుకున్నట్లు చెప్పారు. కాళేశ్వరం కోసం మహారాష్ట్రకు 25 సార్లకు పైగా వెళ్లారన్నారు. ఏ శాఖ ఇచ్చినా సమర్థవంతంగా నిర్వహించారన్నారు.

# రేపటి నుంచి దాదా హజ్రత్ ఉర్సు ఉత్సవాలు

ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నాం : పీఠాధిపతి ఆబిద్ హుస్సేన్



పుల్కల్: మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు దాదా హజ్రత్ ఉర్సు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ ఆబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహేబ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 80వ సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు కుల మతాలతకు అతీతంగా వేలాది మంది భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్ ఇంటి నుంచి తీసుకొని దర్గాలోకి తీసికెళ్లి కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. 6వ తేదీన వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం నాతే మహిఫిల్, సమ, అన్నదాన కార్యక్రమం ఉంటుంది. ముఖ్య అతిథులుగా అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సూఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆబిద్ హుస్సేన్ కోరారు.

# ఇంటి నుంచి వెళ్లి యువతి అదృశ్యం



మానస

వర్గల్(గజ్వేల్): ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పసుల మానస(19) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో బుధవారం యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**కాలేజీకి వెళ్లిన యువతి..**

పటాన్‌చెరు టౌన్: కాలేజీకి వెళ్లిన యువతి అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన లక్ష్మి కూతురు నవనీత (17) పటాన్‌చెరు డివిజన్ పరిధిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో మంగళవారం కాలేజీకి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. కూతురి కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు.

**అచ్చన్నపల్లిలో వ్యక్తి..**



సురేశ్

టేక్మాల్(మెదక్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని అచ్చన్నపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మద్దె సురేశ్ (26) అల్లాదుర్గం సర్కిల్ 108లో పని చేస్తున్నాడు. వారం క్రితం డ్యూటీ నిమిత్తం వెళ్లిన అతడు ఏడు రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు. మంగళవారం భార్య సునీత ఎక్కడికి వెళ్లావు, ఇంటికి ఎందుకు రాలేదని ప్రశ్నించడంతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

### విద్యుదాఘాతంతో కూలీ..



రాజు

సిద్దిపేటరూరల్: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ రాజేశ్ వివరాల మేరకు... వరంగల్ రూరల్ జిల్లా ఆర్జన్నపల్లికి చెందిన అవ్వల రాజు (25) వారం రోజుల క్రితం భార్య రాజేశ్వరితో కలిసి పుల్లూరులోని ముత్యంరెడ్డి కోళ్లఫారంలో పనిలో చేరాడు. మధ్యాహ్న సమయంలో ఫామ్ చుట్టూ పరద కడుతున్న సమయంలో పక్కనే ఉన్న విద్యుత్తు తీగలకు ప్రమాదవశాత్తు ఇనుప నిచ్చెన తగలడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన భార్య కేకలు వేయడంతో పుల్లూరు చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు వచ్చి సీపీఆర్ చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. మృతుడికి ఒక కుమార్తె, కాగా భార్య గర్భవతి.

# ‘మహిళా శక్తి’ బలోపేతం

## కిశోర బాలికలు, వృద్ధుల సంఘాలు ఏర్పాటు

- జిల్లా వ్యాప్తంగా డేటా సేకరణ
- ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధిపై అవగాహన
- వృద్ధులకు పథకాల అమలు బాధ్యతలు



సమావేశంలో స్వశక్తి సంఘాల మహిళలు

హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో మహిళా శక్తిని బలోపేతం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సెర్ప్ అధికారులు నూతనంగా మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులను సంఘాల నుంచి తొలగించిన అధికారులు మళ్లీ వారి వివరాలు సేకరించి వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో ఇప్పటికే 18,267 మహిళా సంఘాల్లో 1,94,210 మంది సభ్యులు ఉండగా వీరికి బ్యాంకుల నుంచి లింకేజీ ఇప్పించి స్వయం ఉపాధి కల్పిస్తున్నారు. వృద్ధులు 108 సంఘాల్లో 10,085 మంది, వికలాంగులు 200 సంఘాల్లో 1502 మంది, కొత్తగా 318 మహిళా సంఘాల్లో 3,181 మంది, మరో 2,647 మందిని ఇతర గ్రూపుల్లో చేర్పించగా మొత్తం 17,415 మంది సభ్యులు చేరారు. వీరికి తోడు 2,400 మందితో 240 కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేశారు. దీంతో మహిళా సంఘాల్లో చేరిన మహిళల సంఖ్య 2,14,025కు చేరింది.

### కిశోర బాలికల సంఘాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు సెర్ప్ అధికారులు గ్రామాల్లోని 15 నుంచి 18 ఏళ్లన్న బాలికలను కిశోర బాలికల సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నారు. వారికి యుక్త వయస్సులో వచ్చే మార్పులు, ఆరోగ్య సమస్యలు, ఆర్థికాభివృద్ధిపై అవగాహన కల్పించి రెండేళ్ల తర్వాత బ్యాంకుల నుంచి లింకేజీ ఇప్పించి స్వయం ఉపాధి కల్పించనున్నారు. ప్రతి నెల గ్రూపుల్లో పొదుపు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క గ్రూపునకు ఎన్ఆర్ఎల్ఎం ద్వారా రూ.15వేల మ్యాచింగ్ గ్రాంటును అందించనున్నారు.

### వృద్ధుల సంఘాలు

గతంలో 60 ఏళ్లు నిండిన మహిళలను స్వశక్తి సంఘాల నుంచి తొలగించారు. ఇప్పుడు ప్రభుత్వం మహిళలకు చీరలు, ప్రతి నెల అభయహస్తం కింద రూ.2,500 చెల్లిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయడానికి వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే ఆసరా ఫించన్లు కూడా వయస్సు పైబడిన వారికి అందించడానికి సంఘాలు కీలక పాత్రను పోషించనున్నాయి. ప్రతి నెల రూ.50 పొదుపు చేయించి, మ్యాచింగ్ గ్రాంటు రూ.15వేలు మంజూరు చేయించనున్నారు.

### ఆర్థిక శక్తిగా నిలుపడానికి



గ్రామాల్లో మహిళలకు ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కల్పించి, సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేసిన రెండేళ్ల తర్వాత వారికి బ్యాంకుల ద్వారా వ్యాపార నిమిత్తం రుణాలను ప్రభుత్వం అందించనుంది.

–బి.తిరుపతి, ఏపీఎం, హుస్నాబాద్